ప్రజాశక్తి

గురువారం 24 అక్టోబర్ 2024 | 5 | విజయనగరం

నేడు వైసిపి అధినేత జగన్ పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం ప్రతినిధి

వైసిపి అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గురువారం గుర్లలో పర్యటించనున్నారు. ఇటీవల డయేరియా విజృంభించి 8మంది మరణించిన సంగతి విధితమే. సుమారు 2వందల మంది డయేరియా బారిన పడ్డారు. ఈనేపథ్యంలో జగన్ పర్యటించనున్నారని ఆ పార్టీజిల్లా అధ్యక్షులు మజ్జి శ్రీనివాసరావు తెలిపారు. ఉదయం 11.05 గంటలకు ఎస్ఎస్ఆర్‌పేట వద్ద దత్తా ఎస్టేట్‌కు హెలికాప్టర్‌లో జగన్ చేరుకుంటారు. అక్కడి నుంచి గుర్ల గ్రామానికి 11.25 గంటలకు వెళ్తారు. అనంతరం డయేరియా బారిన పడిన కుటుంబాలను, మృతుల కుటుంబ సభ్యులను కలిసి మాట్లాడారు. మధ్యాహ్నం 1గంటకు అక్కడి నుంచి విశాఖ మీదుగా విజయవాడ చేరుకుంటారు.

డబ్బులు చెల్లిస్తేనే.. గ్యాస్ ఉచితం

- ఉచిత గ్యాస్ సిలెండర్ల రాయితీపై ప్రభుత్వం మెలిక
- పేదల ఆశలపై నీళ్లు
- ప్రభుత్వ నిర్ణయంపై లబ్ధిదారులు అసంతృప్తి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను...! సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్లు ఉచితంగానే ప్రభుత్వం మంజూరు చేస్తుంది. కానీ, డబ్బులు మాత్రం చెల్లించాలి. అదేంటి ఉచితంగా సిలెండర్లు ఇస్తున్ననప్పుడు డబ్బులు ఎందుకు చెల్లించాలి? అనుకుంటున్నారా..! ఇందులోనే సర్కారు మెలిక ఉంది. ఉచిత సిలెండర్లకు కూడా ముందుగానే డబ్బులు చెల్లించాలట. ఆ తరువాత ఆ మొత్తాన్ని ప్రభుత్వం రియింబర్స్‌గా చెల్లిస్తుందట. దీన్నిబట్టి నగదు బదిలీ పథకంలో భాగంగా గ్యాస్ సిలెండర్లపై పూర్వం నుంచి ఉన్న రాయితీని కేంద్ర ప్రభుత్వం క్రమంగా తగ్గించిన చందంగా ఇందులోనూ ఏదో ఒక మెలిక ఉంటుందని పేదలు భయపడుతున్నారు. ఎన్నికల హామీలో భాగంగా కూటమి ప్రభుత్వం సూపర్-6 పథకాలు ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలెండర్ల పథకాన్ని దీపావళి నుంచి అమలు చేస్తామంటూ బుధవారం జరిగిన మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రాథమిక నిబంధనల ప్రకారం తెల్లరేషన్‌కార్డులు ఉన్నవారందరికీ ఈపథకం వర్తించనుంది. ఈలెక్కన విజయనగరం జిల్లాలో 5,81,268 మందికి, పార్వతీపురం మన్యం జిల్లాలో 2,81,251 తెల్లరేషన్ కార్డుదారులకు ఈ పథకం అందుబాటు లోకి రానుంది. కానీ, డబ్బులు ముందుగా చెల్లించాలన్న నిబంధన పేదలకు రుచించడం లేదు. ప్రస్తుతం జిల్లాలో గ్యాస్ సిలెండర్ ధర రూ.820 వరకు ఉంది.ఈ మొత్తాన్ని లబ్ధిదారులు ముందుగానే చెల్లించాలి. డబ్బులే ఉంటే ఉచితం కోసం ఎందుకు ఆశపడతామని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉచితం అన్నాక ఉచింతంగా ఇవ్వాలిగానీ ఇన్ని మెలికలు ఎందుకని జనం ప్రశ్నిస్తున్నారు. గతంలో కేంద్ర ప్రభుత్వం కూడా గ్యాస్ సిలిండర్ ధర మొత్తం చెల్లిస్తే రాయితీ మొత్తాన్ని తిరిగి బ్యాంకు ఖాతాల్లో జమచేస్తామంటూ ప్రకటించిందని, తీరా ఆచరణలో రూ.200 ఉన్న రాయితీని రూ.3 తగ్గించేసిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఉచిత గ్యాస్ సిలెండర్ల మాటా అలాగే ఉందని పేదలు అంటున్నారు.

నేడు జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనిత రాక

గుర్లలో పర్యటన.. అధికారులతో సమావేశం

ప్రజాశక్తి-విజయనగరం కోట

రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి వంగలపూడి అనిత గురువారం జిల్లాలో పర్యటించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ వెల్లడించారు. మధ్యాహ్నం ఒంటి గంటకు నగరానికి చేరుకొని మాజీ మంత్రి అశోక్ గజపతిరాజు నివాసానికి వెళ్తారని, అక్కడనుండి జెడ్‌పి అతిథి గృహం చేరుకుంటారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు గుర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులను పరామర్శిస్తారని తెలిపారు. మధ్యాహ్నం 3.20 గంటలకు కలెక్టర్ కార్యాలయం చేరుకొని గ్రామీణ నీటి సరఫరా, వైద్య ఆరోగ్య, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్షిస్తారని పేర్కొన్నారు. సాయంత్రం నాలుగు గంటలకు కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు అధికారులతో పలు అభివృద్ధి అంశాలపై సమీక్ష నిర్వహిస్తారని పేర్కొన్నారు.

పాఠశాలకు ఎస్‌బిఐ వితరణ

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సామజిక బాధ్యత (సిఎస్ఆర్) కింద జొన్న గుడ్డి నగరపాలక ప్రాథమిక పాఠశాలకు ఎస్‌బిఐ రూ.2.50 లక్షలతో పలు పరికరాలను అందించింది. బుధవారం కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ ఆధ్వర్యాన కంప్యూటర్ , టేబుల్ బల్లలు, కుర్చీలు, డిజిటల్ బోర్డు , ఫ్యాన్లు, గ్యాస్ పొయ్యి, వంట పాత్రలు తదితర 43 మౌలిక అవసరాలను పాఠశాల యాజమాన్యానికి అందించారు. విద్యా పరంగా వసతులు కల్పించడం మరింత అభివృద్ధి చెందడానికి ఉపకరిస్తుందని ఎస్‌బిఐని అభినందించారు ఎస్.బి.ఐ. రీజినల్ మేనేజర్ సురేష్ బాబు, ఎల్‌డిఎం మూర్తి, ఎంఇఒ సత్యవతి, స్కూల్ మేనేజ్‌మెంట్ చైర్మన్ స్వాతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎట్టకేలకు కదిలిన యంత్రాంగం

జిల్లా అంతటా శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ ● తాగునీటి పథకాల క్లోరినేషన్

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

వాటర్ ట్యాంక్‌ను క్లోరినేషన్ చేస్తున్న సిబ్బంది

రక్షిత తాగునీటి పథకాల శుద్ధికి జిల్లా అధికార యంత్రాంగం ఎట్టకేలకు కదిలింది. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో జిల్లాలో శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ బుధవారం ప్రారంభించారు. పలు గ్రామాల్లో తాగునీటి పథకాల్లో క్లోరినేషన్, తాగునీటి పరీక్షలు, కాలువల్లో బ్లీచింగ్ చల్లడం వంటివి చేపట్టారు. కలుషిత నీటితో గుర్ల మండల కేంద్రంలో ఏడుగురు, దానికి పక్కనేవున్న కోటగండ్రేడు గ్రామంలో ఒకరు మొత్తం ఎనిమిది మంది ఇటీవల డయేరియాతో మృత్యువాతపడ్డ విషయం విధితమే. గుర్ల, గరివిడి, చీపురుపల్లి మండలాల్లో సుమారు 200 డయేరియా కేసులు నమోద య్యాయి. దీన్ని అదుపు చేయడానికి గుర్ల, అదే మండలంలోని గూడెం, నాగళ్లవలస గ్రామాల్లో వైద్యశిబిరాలు కూడా ఏర్పాటు చేయాల్సి వచ్చింది. చీపురుపల్లి సిహెచ్‌సితోపాటు ఈ నియోజకవర్గం లోని పిహెచ్‌సిల్లో డయేరియా కేసులు ఎక్కువగా నమోదయ్యాయి. ముఖ్యంగా గుర్లలోనే సుమారు 200 కేసులు బయటపడ్డాయి. ఈనేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జిల్లా వ్యాప్తంగా తాగునీటి పథకాల శుద్ధికి, పరిసరాల పరిశుభ్రత కోసం స్పెషల్ డ్రైవ్‌కు పిలుపునిచ్చిన సంగతి విధితమే. ఇందులో భాగంగా డెంకాడ, పూసపాటిరేగ, భోగాపురం మండలాల్లో కలెక్టర్ అంబేద్కర్ సుడిగాలి పర్యటన చేశారు. దాదాపు అన్ని మండలాల్లోనూ ప్రత్యేక అధికారులు గ్రామాల్లో పర్యటించారు. గ్రామాల్లో కాలువల్లో పూడికను, కాలువలు, రోడ్లల్లో పేరుకు పోయిన చెత్తను తొలగించారు. నీళ్ల ట్యాంకులను ఖాళీ చేసి, శుభ్రం చేసిన తరువాత మళ్లీ నీటితో నింపడం, నింపిన నీటిని క్లోరినేషన్ చేయడం వంటివి చేపట్టారు. నీటి నమూనాలను సేకరించి నాణ్యత పరీక్షలు నిర్వహించారు. కొన్నిబోర్లు, బావులను సైతం క్లోరినేషన్ చేపట్టారు. తాగునీటి స్టోరేజ్ ట్యాంకులవద్ద ప్రత్యేక నమూనాతో బోర్డులను ఏర్పాటు చేశారు. ఇలా ప్రతీ 15 రోజులకో సారి తాగునీటి ట్యాంకులను పరిశుభ్రం చేసేందుకు ఈ బోర్డులను ఏర్పాటు చేస్తున్నట్టుగా అధికారులు చెబుతున్నారు. జిల్లాలోని మొత్తం 777 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటన్నింటి లోనూ క్లీనింగ్, క్లోరినేషన్, రోడ్లు, కాలువలు శుభ్రపర్చేందుకు సుమారు రూ.127 కోట్ల 15వ ఆర్థిక సంఘం నిధులు అందుబాటులో ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

పోస్టుకార్డులు చూపుతున్న కాంగ్రెస్ నాయకులు, మహిళలు

ఉచిత బస్ హామీ నెరవేర్చాలని

కాంగ్రెస్ పోస్టు కార్డు ఉద్యమం

ప్రజాశక్తి- విజయనగరం కోట

అధికారంలోకి వచ్చి ఐదు నెలలు గడుస్తున్నప్పటికీ సూపర్‌సిక్స్ హామీల్లో భాగమైన మహిళలకు ఆర్టీసీ బస్సు ఉచిత ప్రయాణం పథకాన్ని నెరవేర్చాలని కోరుతూ కాంగ్రెస్ ఆధ్వర్యాన ముఖ్యమంత్రికి పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. బుధవారం కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎం.విద్యాసాగర్ ఆధ్వర్యాన బస్సులో మహిళలను కలిసి ఉచిత ప్రయాణం ఎప్పుడు అంటూ పోస్టుకార్డులు రాయించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 4నెలల గడిచినా మహిళలకు ఇచ్చిన మాట నెరవేర్చలేదని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలుకు ఇంకెంత సమయం కావాలన్నారు. మరోవైపు ఉచిత గ్యాస్ కనెక్షన్లకు ప్రభుత్వం మెలిక పెట్టిందని, డబ్బులు పెట్టి విడిపించుకున్న తరువాత అకౌంట్లలో డబ్బులు వేస్తామని చెప్పడం సరికాదని అన్నారు. శ్రీనివాసరావు , షరీఫ్, కరీం, కిరణ్, రెహమాన్, చంద్రశేఖర్, మౌనిక, కార్యకర్తలు నాయకులు పాల్గొన్నారు.

'దానా'పై అప్రమత్తం

- మత్స్యకారులు వేటకు వెళ్లొద్దని హెచ్చరిక
- ఒక్కో గామానికి మండలస్థాయి అధికారి
- పునరావాస కేంద్రాలు ఏర్పాటు

తుపాను నేపథ్యంలో మత్స్యకారులు ఒడ్డుకు చేర్చిన పడవలు

ప్రజాశక్తి-భోగాపురం, పూసపాటిరేగ

బంగాళాఖాతంలో ఏర్పడిన 'దానా' తుపానుపై అధికారులు అప్రమత్తమయ్యారు. తుపాను తీవ్రత నేపథ్యంలో ఈనెల 24 నుంచి జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సముద్ర, నదీ పరివాహక ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. ప్రధానంగా భోగాపురం, పూసపాటిరేగ మండలాల్లోని తీరప్రాంత గ్రామాల్లో మత్స్యకారులను అధికారులు అప్రమత్తం చేశారు. మూడు రోజులు పాటు వేటకు వెళ్లవద్దని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు సంబంధిత గ్రామాల్లో దండోరా కూడా వేయించారు. భోగాపురం మండలంలోని ఇటు చోడిపిల్లిపేట నుంచి అటు చేపలకంచేరు వరకు ఉన్న ఎనిమిది తీరప్రాంత గ్రామాలకు ఎనిమిది మంది మండల స్థాయి అధికారులతో పాటు నలుగురు సచివాలయ సిబ్బందిని నియమించినట్లు తహశీల్దారు సురేష్ తెలిపారు. అంతేకాక అత్యవసర పరిస్థితుల్లో తరలించేందుకు కూడా పునరావాస కేంద్రాలను సైతం సిద్ధం చేశారు. పునరావాస కేంద్రాలకు తరలించే వారికి అవసరమైతే భోజనాలు వండించేందుకు మధ్యాహ్న భోజన పథకం నిర్వాహికులను కూడా సిద్ధంగా ఉండాలని సూచించారు. మత్స్యకారులు తమ బోట్లను తీరానికి దూరంగా ఉంచాలని ఇప్పటికే అధికారులు సూచించడంతో అప్రమత్తమై వాటిని తీరానికి చేర్చారు. భోగాపురం, పూసపాటిరేగ మండల తహశీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూములను ఏర్పాటు చేశారు. ఎటువంటి ఇబ్బందులున్నా వెంటనే సమాచారం ఇవ్వాలని అధికారులు సూచించారు. మత్స్యకార గ్రామాల్లో నియమించిన మండలస్థాయి అధికారులు అక్కడ పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి ఉన్నతాధికారులకు సమాచారం చేరవేయాలని ఆదేశించారు. ఎటువంటి ప్రాణ నష్టం వాటిల్లకుండా చూడాలని సూచించారు.

మండలస్థాయి అధికారులను నియమించాం

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మండలంలో ఉన్న ఎనిమిది తీరప్రాంత గ్రామాలకు ఎనిమిది మంది మండలస్థాయి అధికారులతో పాటు నలుగురు సచివాలయ సిబ్బందిని నియమించాం. పునరావాస కేంద్రాలను కూడా సిద్ధం చేసి ఉంచాం. అక్కడ పరిస్థితులను చూసుకొని అవసరమైతే తరలిస్తాం. తహశీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమును ఏర్పాటు చేశాం.

ఎం.సురేష్, తహశీల్దార్, భోగాపురం

పారిశుధ్య కార్యక్రమాలు కలెక్టర్ తనిఖీ

ప్రజాశక్తి-డెంకాడ,పూసపాటిరేగ,భోగాపురం

పారిశుధ్య పనులపై ఆరా తీస్తున్న కలెక్టర్ అంబేద్కర్

గ్రామాల్లో వాటర్ టాంకులన్నిటినీ శుభ్రపరచి క్లోరినేషన్ చేయాలని, ట్యాంక్‌ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అధికారులకు ఆదేశించారు. ట్యాంక్ ల ద్వారా సరఫరా చేసే నీటిని పరీక్ష చేయాలనిఇ, ట్యాంక్ లను పరిశుభ్రం చేసి క్లోరినేషన్ చేసి తేదీలను సంబంధిత రిజిస్టర్ లో నమోదు అధికారులను ఆదేశించారు. ఎంపిడిఒలకు కార్యదర్శులు వివరాలను సమర్పించాలని ఆదేశించారు. బుధవారం కలెక్టర్ డెంకాడ మండలం నాతవలస, పూసపాటిరేగ మండలం చింతపల్లి, భోగాపురం మండలం చాకివలస గ్రామాల్లో పర్యటించారు. ప్రత్యేక శానిటేషన్ డ్రైవ్ లో భాగంగా అక్కడ జరుగుతున్న పారిశుధ్య కార్యక్రమాలను తనిఖీ చేసారు. వాటర్ ట్యాంక్ ల వద్దకు వెళ్లి పరిశీలించారు. నాతవలస లో తాగు నీటి పైపులు డ్రైనేజి లో ఉండడం గుర్తించిన కలెక్టర్ వాటిని తొలగించి కొంచెం దూరంగా ఉండేలా ఏర్పాటు చేయాలన్నారు. వినియోగించని పైప్ లైన్లను తొలగించాలని , గ్రామస్తులకు రక్షిత తాగు నీటిని అందేలా చూడాలని తెలిపారు. నాతవలసలో జల జీవన్ మిషన్ కింద కుళాయి లు మంజూరు కాలేదని గ్రామస్తులు తెలుపగా ఆర్.డబ్ల్యు.ఎస్. అధికారుల ను ఎందుకు మంజూరు కాలేదో కారణాలను వివరించాలని కలెక్టర్ ఆదేశించారు. ఇళ్ళ మధ్య డ్రైనేజి లేదని గ్రామస్తులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా ఉపాధి హామీ నిధులతో నిర్మించడానికి ప్రతిపాదనలు పంపాలని ఎంపిడిఒకు తెలిపారు. చాకివలసలో జల జీవన్ మిషన్ కింద మంజురైన ప్రాజెక్ట్ ట్యాంక్ ను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ కీర్తి, జెడ్‌పి సిఇఒ సత్యనారాయణ, మండల ప్రత్యేకాధికారులు, డివిజినల్ పంచాయతీ అధికారి మోహన్ రావు, మూడు మండలాల తహశీల్దార్లు, ఎంపిడిఒలు, ఇఒపిఆర్‌డిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విద్యారంగానికి మొండిచేయి దుర్మార్గం : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

తాజాగా జరిగిన మంత్రిమండలి సమావేశంలో విద్యారంగంపై చర్చించపోవడం దుర్మార్గమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు డి. రాము, సిహెచ్ వెంకటేశ్ తెలిపారు. బుధవారం స్థానిక ఎల్ బి జి భవనం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఈ జిల్లాలో గత రెండేళ్లగా డిగ్రీ, ఇంజనీరింగ్, పీజీ విద్యార్థులకు ప్రభుత్వం రియంబర్స్‌మెంట్ ఫీజులను ఆపేయడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ ఇబ్బందులను ప్రభుత్వానికి తెలియ జేయాలని ఉద్దేశంతో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో రెండు రోజుల క్రితం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించామని తెలిపారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో విద్యార్థులకు అండగా ఉంటామని, గత ప్రభుత్వం బాకీ పెట్టిన మొత్తంతో పాటు ఈ ప్రభుత్వం ఇవ్వాల్సిన ఫీజులను కలిపి విద్యార్థులకు ఇచ్చే విధంగా కృషి చేస్తానని తెలిపారని పేర్కొన్నారు. కానీ నేడు జరిగిన మంత్రి మండలి నిర్ణయాలలో విడుదల చేయాల్సిన స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై ఎటువంటి స్పందన లేకపోవడం విచారకరమని అన్నారు. తక్షణమే పెండింగ్‌లో ఉన్న విద్యాదీవెన నిధులు విడుదల చేయాలని లేదంటే పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని తెలిపారు.

రాత్రి 11గంటల తరువాత తిరిగితే కేసులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కారణం లేకుండా అర్ధ రాత్రుళ్ళు పట్టణాల్లో తిరిగితే టౌను న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేయాలని పోలీసు అధికారులను ఎస్‌పి వకుల్‌జిందాల్ ఆదేశించారు. గత నాలుగు నెలల్లో ఇప్పటికే 450 మందిపై టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి, కౌన్సిలింగు నిర్వహించారని తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణకు ఎస్‌పికొన్ని కఠిన నిర్ణయాలు చేపట్టడంతో పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తం అయ్యారు. ఇందులో భాగంగా విజయనగరంలో రైల్వే స్టేషను, ఆర్టీసి కాంప్లెక్స్, మూడు లాంతర్లు, కోట జంక్షన్, బాలాజీ జంక్షన్, దాసన్నపేట రైతు బజార్, రింగు రోడ్డు, కొత్తపేట, ఐస్ ఫ్యాక్టరీ, జమ్ము, విటి అగ్రహారం, బొబ్బిలి, నెల్లిమర్ల, రాజాం మున్సిపాల్టీల్లో కొన్ని ముఖ్య ప్రాంతాల్లోను పోలీసులు తనిఖీలు చేపడుతున్నారు. రాత్రి 11గంటల తరువాత వ్యాపారాలు, షాపులు, టిఫిన్ బండ్లు మూసివేసే విధంగా చర్యలు తీసుకొంటూ, నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా వ్యాపారాలు సాగించినా, సహేతుకమైన కారణం లేకుండా బహిరంగ ప్రదేశాల్లో సంచరించినా వారిపై టౌన్ న్యూసెన్సు చట్టం ప్రకారం కేసులు నమోదు చేస్తున్నారు. వారిని పోలీసు స్టేషనుకు తరలించి, తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగు నిర్వహిస్తు న్నారు. రాత్రి గస్తీలో భాగంగా ఆయా బీటు పరిధిలోని ప్రభుత్వ కార్యాలయాలు, బ్యాంకులు, పాయింటు పుస్తకాలు గల ప్రాంతాలను తప్పనిసరిగా సందర్శించేలా చర్యలు చేపట్టారు.

తగ్గిన డయేరియా కేసులు

ప్రజాశక్తి-గుర్ల

మండలంలోని గుర్ల, గోషాడ, గూడెం, కోటగండ్రేడు, పున్నపురెడ్డి పేట, నాగళ్లవలస, గుజ్జంగివలస, పెనుబర్తి గ్రామాలలో ప్రబలిన డయేరియా అదుపులోకి వచ్చింది. బుధవారం కొత్తగా కేసులు నమోదు కాకపోవడంతో ప్రజలు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. పదిరోజుల క్రితం మండలంలో, ప్రధానంగా గుర్లలో డయేరియా విజృంభించి 9 మంది మృత్యువాత పడిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అధికారులు గుర్ల, గూడెం, నాగళ్లవలసలో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. బుధవారం గూడెంలో వైద్య శిబిరాన్ని ఎత్తివేయగా, నాగళ్లవలసలో వైద్య శిబిరంలో ఒక్కరోగి కూడా లేరు. ఇక్కడ చికిత్స పొందుతున్న వారు కోలుకోవడంతో డిశ్చార్జి చేశారు. ప్రస్తుతం గుర్ల పిహెచ్‌సిలో ఐదుగురు, తెట్టంగి పిహెచ్‌సిలో ఒకరు చికిత్స పొందుతున్నారు. చంపావతి నది నుండి వచ్చిన తాగునీటిని నిలుపుదల చేసి, ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేయడంతో వ్యాధి అదుపులోకి వచ్చిందని అధికారులు భావిస్తున్నారు. కొత్త కేసులు నమోదు కాకపోవడంతో ఊపిరి పీల్చుకుంటున్నారు.

అంగన్‌వాడీలపై రాజకీయ వేధింపులు మానుకోవాలి

- మంత్రులు జోక్యం చేసుకొని సమస్యను పరిష్కరించాలి
- అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉమా మహేశ్వరి

ప్రజాశక్తి-గజపతినగరం

సమావేశంలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరి

అంగన్‌వాడీ కార్యకర్తలపైనా, హెల్పర్లపైనా రాజకీయ వేధింపులకు పాల్పడడం తగదని, నాయకుల చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.ఉమామహేశ్వరి, జిల్లా అధ్యక్షులు బి.పైడిరాజు, జిల్లా గౌరవాధ్యక్షులు వి.లక్ష్మి అన్నారు. బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడారు. గజపతినగరం మండలం రామన్నపేటలో అంగనవాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న మానాపురం సౌజన్యను రాజకీయ వేధింపులకు గురిచేస్తూ తొలగించేందుకు ప్రయత్నించడాన్ని వారు ఖండించారు. రెండేళ్ల క్రితం ఆమె సర్టిఫికెట్లను పరిశీలించిన తరువాతే అధికారులు ఉద్యోగం ఇచ్చారని, కానీ నేడు ఆ సర్టిఫికెట్లు నకిలీవని చెప్పి ప్రభుత్వం మారిన వెంటనే ఆమెను తొలగించేందుకు ఆ గ్రామ సర్పంచ్, గతంలో దరఖాస్తు చేసిన లబ్ధిదారుతో కలెక్టర్‌కు ఫిర్యాదు చేయించారని తెలిపారు. తహశీల్దార్‌తో విచారణ చేయించి ఆమెకు నేటివిటి సర్టిఫికెట్ లేదని చెబుతూ తొలగించేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. రెండేళ్లుగా అన్యాయం గుర్తుకు రాలేదా? అని నాయకులు ప్రశ్నించారు. ఉద్యోగం రాక ముందు నుంచి సౌజన్య ఇచ్చిన సర్టిఫికెట్లు కూడా తమ వద్ద ఉన్నాయంటూ విలేకర్లకు చూపించారు. అధికారులు సమగ్రంగా విచార చేయాలని కోరారు. రాజకీయ వేధింపులను అరికట్టాలని స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణికి, జిల్లా మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతులు ఇచ్చామని తెలిపారు. ఆ సమయంలో మంత్రి వద్ద ఉన్న మక్కువ శ్రీధర్ స్పందిస్తూ రామన్నపేటలో వేధింపులు లేవంటూనే గజపతినగరం ఐసిడిఎస్ కార్యాలయానికి సిడిపిఒ, సూపర్‌వైజర్ల, అంగన్‌వాడీ కార్యకర్తలను పిలిపించి తన సమక్షంలో వేధింపులు లేవని రాతపూర్వకంగా లెటర్ రాయించారని తెలిపారు. వేధింపులు లేనప్పుడు ఆఫీసులో బలవంతంగా ఎందుకు లేఖలు రాయించాల్సి వచ్చిందని ప్రశ్నించారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ప్రయత్నిస్తే కార్యాలయానికి తాళాలు వేయడం సిడిపిఒకు తగదని అన్నారు. తమ యూనియన్ ఏ నాయకులకూ వ్యతిరేకం కాదని, ప్రభుత్వంతో సమస్యలపై పోరాడుతామని తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షులు వి లక్ష్మి మాట్లాడుతూ ప్రాజెక్టు అధ్యక్షులు సుభాషిని రాజకీయ వేధింపులు లేవని రాసి ఇవ్వనందుకు ఆమె సెంటర్‌లో సూపర్‌వైజర్ పర్మిషన్ తీసుకొని బయటికి వెళ్లిన సమయంలో ఫోటో తీయించి పత్రికలకు ఇచ్చి మెమో ఇచ్చేటట్లు చేశారని, ఇది రాజకీయ వేధింపులు కావా అని ప్రశ్నించారు. రామన్నపేట హెల్పర్ వాళ్ళ టీచర్ పర్మిషన్ తీసుకొని తన కన్న బిడ్డకు పాలు ఇవ్వడానికి వెళ్లిన సమయంలో సర్పంచ్ సెంటర్‌కు వెళ్లి ఫోటో తీసి ఫిర్యాదు చేసినందుకు అధికారులు మెమో ఇచ్చారని, ఇది వేధింపులు కావా అని ప్రశ్నించారు. మంత్రులు సంధ్యారాణి, శ్రీనివాస్ స్పందించి రాజకీయ వేధింపులను ఆపి, అంగన్వాడీ కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

ఆక్రమణలపై కమిషనర్ ఆగ్రహం

పలు ప్రాంతాల్లో పర్యటన
పారిశుధ్య పనులు పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోనివైయస్సార్ నగర్, సోనియా నగర్, అయ్యన్నపేట తదితర ప్రాంతాల్లో నగరపాలక సంస్థ కమిషనర్ పి. నల్లనయ్య బుధవారం పర్యటించి పారిశుధ్య పనులను పరిశీలించారు. రహదారులపై ఆక్రమణలను గమనించి తక్షణమే వాటిని తొలగించాలని ఆదేశించారు. రహదారులపై భవన వ్యర్థాలను పడవేయడానికి చూసి ఎమినిటీస్ కార్యదర్శులను మందలించారు. ప్రతిరోజు వార్డ్ సచివాలయ పరిధిలో తప్పనిసరిగా పర్యటించి క్షేత్రస్థాయిలో ఇబ్బందులను గమనించి తక్షణమే పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశించారు. నగరంలో వాటర్ ట్యాంకులు పరిశుభ్రత పై ఆరా తీశారు. మొత్తం 36 వాటర్ ట్యాంకుల ఉండగా వాటిలో 28 వాటర్ ట్యాంకులు పరిశుభ్రపరిచినట్లు సిబ్బంది తెలిపారు. కమిషనర్ ఆదేశాల మేరకు అయ్యన్నపేట, కామాక్షి నగర్ లో ఆక్రమణలను నగర పాలక సంస్థ అధికారులు తొలగించారు. కార్యక్రమములో టిపిఒ అప్పలరాజు, ఎసిపి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కోనూరు జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు

రాష్ట స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు

కోనూరు విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అండర్.14 ,17 బాల బాలికల క్రీడాపోటీల్లో బాడంగి మండలం కోనూరు జెడ్‌పి హైస్కూలు విద్యార్థులు ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరంలో రాజీవ్ సేడియం, విజ్జి స్టేడియం, నెల్లిమర్ల మండలం కొండవెలగాడ, డెంకాడ మండలం రఘుమండ, కొత్తవలసలోని జిందాల్ భారతి పాఠశాల ఆవరణలో జిల్లా స్థాయి హాకీ, క్రికెట్, బాస్కెట్ బాల్, రెజ్లింగ్, ఫుట్ బాల్, కబడ్డీ, హేండ్‌బాల్, త్రో బాల్ పోటీలు జరిగాయి. ఈ క్రీడలన్నింటిలోనూ కోనూరు పాఠశాలకు చెందిన 24 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. విద్యార్థులను, పాఠశాల పిఇటి ఎస్.విజయలక్ష్మిని ప్రధానోపాధ్యాయులు టి వి జి కె మూర్తి అభినందించారు.

టిడ్కో చైర్మన్‌కు విక్రమ్, అయ్యలు అభినందనలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

టిడ్కో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వేములపాటి అజయ్ కుమార్‌ను జనసేన నాయకులు అవనాపు విక్రమ్, గురాన అయ్యలు బుధవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. విజయవాడ టిడ్కో కార్యాలయంలో అజయ్ కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయనను మర్యాద పూర్వకంగా నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు



టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న విక్రమ్, అయ్యలు

మరో గుర్ల కానివ్వొద్దు ..

• చంపావతి నదిలో కలిసిపోతున్న వ్యర్థాలు • వాడుక నీరూ అందులోకే.. • రోగాలకు ప్రధాన కారణం ఇదేనా..? • ఆరు మండలాల్లో ఇదే పరిస్థితి

చంపావతి నదీ పరివాహక ప్రాంతాల్లోని వాడుక నీరు, వ్యర్థాలు పెద్ద ఎత్తున నదిలో కలిసిపోవడంతో నీరు కలుషితమవుతుంది. దీంతో చంపావతి నది నుంచి రక్షిత మంచినీటి పథకాలు ద్వారా గ్రామాలకు వెలుతున్న తాగునీరు విషపూరిత మవుతుంది. ఫలితంగా గ్రామాల్లో ప్రజలు రోగాలు బారిన పడుతు న్నారు. ఇటీవల గుర్లలో ప్రబలిన డయేరియాకు కూడా నీటి కలుషితమే కారణమని వైద్యాధికారులు వెల్లడించడమే దీనికి తార్కాణం. దీంతో నదీ పరివాహక ప్రాంతాల్లోని నివాసితులు భయాందోళనకు గురవుతున్నారు.

ప్రజాశక్తి- డెంకాడ, నెల్లిమర్ల, భోగాపురం

చంపావతి నదిని ఆనుకుని ఉన్న నెల్లిమర్ల, గుర్ల, డెంకాడ, పూసపాటిరేగ, గజపతినగరం, మెంటాడ మండలాల్లోని పలు గ్రామాలు నుంచి వచ్చే వ్యర్థాలు నేరుగా నదిలో కలిసిపోవడం వల్ల నీటి కాలుష్యం ఏర్పడుతుంది. ఈ నీటిని తాగిన ఆయా గ్రామాలకు చెందిన ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు. చంపావతి నది నుంచి వందలాది గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. ఒకవైపు నది కలుషితం కావడం, మరోవైపు గ్రామల్లో తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయకపోవడం వంటి కారణాలతో ప్రజలు రోగాలు బారిన పడుతున్నారు.

డెంకాడ మండలంలో 50 గ్రామాలకు ఆ నీరే..

చంపావతి నదీ పరివాహక ప్రాంతలోని కె. ముంగినాపల్లి సమీపంలోని విజయనగరం డంపింగ్ యార్డ్ నదికి ఆనుకొని ఉంది. విజయనగరం మున్సిపాల్టీ నుంచి వచ్చిన వ్యర్థాలన్నీ ఇక్కడే డంపింగ్ చేసేవారు. ప్రస్తుతం విజయనగరం నుంచి వెలువడుతున్న వ్యర్థాలను ఆ ప్రాంతానికి తరలించకపోయినా గతంలో తరలించిన వ్యర్థాలు అక్కడే నిల్వ ఉండిపోవడం వల్ల అది వర్షాకాలం అలా చంపావతి నదిలోకి కలిసిపోతుంది. దీని వల్ల పక్కనే ఉన్న ముంగినాపల్లి గ్రామంలో తాగునీరు కలుషితమై ఆ గ్రామంలో ప్రతి ఒక్కరూ వివిధ రకాల వ్యాధులకు గురవుతున్నారు. ఈ విషయంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో అనేకసార్లు పోరాటాలు చేశారు. వర్షం వస్తే ఈ డంపింగ్ యార్డ్ లో నీరంతా చంపావతి నదిలో కలిసిపోతుంది. దీంతో నదిలో ఉన్న తాగునీరు బోర్లు అన్ని కలుషితమవుతున్నాయి. ఈ చంపావతి నది నుంచే మండలంలో సుమారు 50 గ్రామాల వరకు తాగునీరు అందిస్తున్నారు. భోగాపురం మండలానికి కూడా ఈ నది నుంచే తాగునీరు సరఫరా చేస్తున్నారు. డి.కొల్లం, చోల్లంగిపేట, గుణుపూర్ పేట, గునుపూరు, డెంకాడ, సింగవరం, నాతవలస గ్రామాల నుంచి వస్తున్న వ్యర్థాలు, మురుగు కాలువల ద్వారా నేరుగా నదిలో కలిసిపోతున్నాయి. ఈ పంచాయతీల డంపింగ్ యార్డులు కూడా చంపావతి నది పక్కన ఏర్పాటు చేసుకున్నారు. ముఖ్యంగా చంపావతి నది కలుషితం అవ్వడం వల్లే రోగాలు వస్తున్నాయని అనేకసార్లు ప్రజలు ఆందోళన చేసినా ప్రయోజనం లేకపోయింది. తాజాగా గుర్లలో డయేరియాతో చాలా మంది చనిపోవడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. గుర్ల సమీపంలో చంపావతి నది కలుషితంపై దృష్టి పెట్టారు. ఆ ప్రాంతమే కాకుండా నదీ పరివాహక ప్రాంతాలన్నింటిపైనా దృష్టి పెట్టి చంపావతి నది కలుషితం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని గుర్ల వంటి సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

డెంకాడ: ముంగినాపల్లి వద్ద నదిని ఆనుకుని వేసిన చెత్త

నెల్లిమర్ల: కాలువ ద్వారా చంపావతిలో కలిసి పోతున్న మురుగు నీరు

నగర పంచాయతీ వ్యర్థాలూ నదిలోకే..

నెల్లిమర్ల: చంపావతి నది వ్యర్థాలతో కలుషితమవుతోంది. ముఖ్యంగా చంపావతి నది పరివాహక ప్రాంతాలు మొయిద నారాయణ పట్నం, జరజాపుపేట, నెల్లిమర్ల, సారిపల్లి గ్రామాల్లో వ్యర్థాలు చంపావతి నదిలో కలసి నీటిని కలుషితం చేస్తున్నాయి. కోళ్ల వ్యర్థాలు, వాటర్ పేకెట్లు, మద్యం బాటిళ్లు, మురుగు నీరు నదిలో కలిసిపోయి మరింత కలుషితం చేస్తున్నాయి. కాగా ఇదే నది నుంచి వేలాది మంది తాగు నీటిని ఉపయోగిస్తున్నారు. గుర్లలో కూడా చంపావతి నీటిని తాగే డయేరియాకు గురైనట్లు తెలిసోంది.

డయేరియా వచ్చేంత వరకూ స్పందించరా?

భోగాపురం: మండలంలోని ముంజేరు గ్రామంలో మురుగునీరు రోడ్డు పైనుంచే ప్రవహిస్తుంది. దీంతో సమీప ప్రాంత ప్రజల తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ఇరు వర్గాల మధ్య కాలువ వివాదం ఉండడంతో ఈ సమస్యను అటు అధికారులు ఇటు ప్రజాప్రతినిధులు తేల్చలేకపోయారు. గ్రామంలోని ఆయా ఇళ్ల వద్ద నుంచి వస్తున్న మురుగునీరు కాలువలో నిల్వ ఉండిపోతుంది. అనంతరం ఆ నీరు ముక్కాం వెళ్లే రహదారి మీద నుంచి ప్రవహిస్తోంది. దాని పైనుంచే వివిధ గ్రామాల ప్రజలు, ప్రయాణికులు, గ్రామస్తులు రాకపోకలు చేస్తున్నారు. కుళాయిలు కూడా కాల్వకు ఆనుకొని ఉండటంతో అక్కడే తాగునీటిని పడుతున్నారు. మరో గుర్ల లా కాకముందే కాలువ సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్న మురుగు నీరు..

అవకతవకలపై సమగ్ర దర్యాప్తు చేయాలి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

2016 నుంచి 2018 మధ్య కార్మికులకు రావలసిన ఏరియర్స్ అవకతవకలపై సమగ్ర దర్యాప్తు జరపాలని ఎపి వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం నగర పంచాయతీ కార్యాలయం ముందు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యులు ఎ. జగన్మోహన్‌రావు మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులతో సమానంగా ఇంజనీరింగ్ నాన్ పిహెచ్ కార్మికులకు బెస్ట్ వేతనం రూ.21వేలు టెక్నికల్ వేతనం రూ.24వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమ్మె ఒప్పందంలో భాగంగా గత ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలకు జీవోలు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసు 62 ఏళ్లకు పెంచాలని, సబ్బులు, నూనెలు, యూనిఫామ్, రక్షణ పరికరాలు పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన తుపాకుల రవణమ్మ, బొమ్మాలి వెంకట్ కుటుంబంలో ఒకరికి వెంటనే ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం కమిషనర్ కె.అప్పలనాయుడుకు వినతి పత్రం సమర్పించారు. కమిషనర్ స్పందిస్తూ ఏరియర్స్ అవకతవకలపై వారం రోజుల్లో విచారణ జరుపుతామని, మరణించిన వారి బిడ్డలకు ఉద్యోగాల కోసం కౌన్సిల్లో ఆమోదానికి పెడతామని, పనిముట్లు, రక్షణ పరికరాల డిసెంబర్ నెలకి ఇచ్చే ప్రయత్నం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కార్యదర్శి బాబురావు, నాయకులు శేఖర్, పైడ్రాజు, శ్రీను, వెంకట్, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చేస్తున్న కార్మికులు

అబ్జర్వర్‌గా శ్రీరాములు

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణానికి చెందిన డాక్టర్ పొట్నూరు శ్రీరాములు ఈనెల 28,29,30 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా మల్కిపురంలో జరగబోవు రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ బ్యాడ్మింటన్ అండర్-14, 17 పోటీలకు అబ్జర్వర్‌గా ఎంపికైనట్లు శ్రీరాములు బుధవారం తెలిపారు. ఈయన ప్రస్తుతం ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీడీగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరాములు భారత బ్యాడ్మింటన్ అసోసియేషన్ గ్రేడ్-1 అంపైర్‌గా, అనేక రాష్ట్ర జాతీయ, అంతర్జాతీయ పోటీలకు న్యాయ నిర్ణేతగా వ్యవహరించారు. 2010లో న్యూఢిల్లీలో జరిగిన కామన్వెల్త్ క్రీడలకు టెక్నికల్ అఫీషియల్‌గా వ్యవహరించారు. అటు క్రీడాకారుడిగా జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో ప్రతిభ కనబరిచి, మూడు పర్యాయాలు విజయనగరం జిల్లా బ్యాడ్మింటన్ కార్యదర్శిగా సేవలందించి ఒక కోచ్‌గా ప్రస్తుతం విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరాములు ఎంపిక పట్ల జిల్లా ఎస్‌జిఎఫ్ కార్యదర్శి కే. కృష్ణంరాజు, జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఇందుకూరి రఘు రాజు, గౌరవ అధ్యక్షులు ద్వారపురెడ్డి జగదీష్, అధ్యక్షులు డాక్టర్ కెవి నాయుడు, సహకార్యదర్శులు డాక్టర్ వివిస్ ప్రసాద్, ఎంకెబి శ్రీను, అట్లూరి శ్రీ వెంకట్రావు, కార్యదర్శి నున్న సురేష్, ఎస్.కోట గ్రామ పెద్దలు డాక్టర్ ఎస్ వి సత్య శేఖర్, ఆనల మోహన్, ఆనల రమేష్, మంత సుబ్బారావు, కోచ్ ఎండి ఖలీలుల్లా, గ్రామ క్రీడాకారులు అభినందించారు.

మరోసారి బయటపడ్డ బ్యాంకు బాగోతం

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పట్టణానికి చెందిన వెంకటరమణ అనే వినియోగదారుడు 2019లో పుల్‌ట్రాన్ ఇండియా క్రెడిట్ కంపెనీలో హీరో హోండా గ్లామర్ మోటార్ సైకిల్‌కు ఫైనాన్స్ తీసుకున్నాడు. 2022 సంవత్సరం లోపు పూర్తి బకాయిని చెల్లించాడు. అప్పటి నుంచి నేటి వరకు తన మోటార్ వెహికల్ క్లియరెన్స్, ట్రాన్స్ఫర్ చేయమని పలుమార్లు కంపెనీ చుట్టూ తిరిగినప్పటికీ యాజమాన్యం కొంటి సాకులతో తప్పించుకుంది. దీంతో ఆవేదనకు గురైన బాధితుడు సిపిఎం నాయకులు చల్లా జగన్, ఇతర నాయకులను ఆశ్రయించగా వారు సంయుక్తంగా కంపెనీ బ్రాంచ్ ముందు బుధవారం ఆందోళన చేశారు. ఆందోళనతో దిగి వచ్చిన బ్రాంచ్ మేనేజర్ నవంబర్ 15లోపు సమస్యను పరిష్కరిస్తామని హామీ పత్రం రాసి ఇవ్వడంతో బాధితులు, ఆందోళన కారులు ఆందోళనను విరమించారు. పుల్‌ట్రాన్ ఇండియా క్రెడిట్ కంపెనీకి ఇది కొత్త ఏమీ కాదని గతంలో కూడా చాలా మంది ఇటువంటి ఆందోళనలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. రుణం మొత్తం తీర్చినప్పటికీ మోటార్ సైకిల్‌కు ట్రాన్స్‌ఫర్ విషయంలో చాలా ఇబ్బందులు జరుగుతున్నాయని ఇటువంటి బాధితులు చాలామంది ఉన్నారని వారందరికీ సమస్యను పరిష్కారం చేసి తగు న్యాయం చేయాలని, లేనియెడల కంపెనీ ముందు మళ్ళీ ఆందోళన చేయడానికి సిద్ధమని సిపిఎం నాయకులు చల్లా జగన్ హెచ్చరించారు.

అతివేగం ప్రమాదకరం

ప్రజాశక్తి- బొండపల్లి

వాహనాలు అతి వేగంగా నడపడం ప్రమాదకరమని బొండపల్లి ఎస్ఐ యు.మహేష్ అన్నారు. మండల సముదాయం వద్ద 26వ జాతీయ రహదారి పై గురువారం వాహన తనిఖీని చేపట్టారు. ఈ సందర్భంగా వాహనదారులతో ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ ఇంటి దగ్గర నుంచి గమ్యం చేరే క్రమంలో వాహనాలను నెమ్మదిగా వెళ్లేందుకు ప్రయత్నం చేయాలని వాహనదారులకు స్పష్టం చేశారు.

తెగుళ్లపై రైతులు అప్రమత్తం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

తెగుళ్లపై రైతులు అప్రమత్తంగా ఉండాలని ఎఒ పూర్ణిమ అన్నారు. మండలంలోని సీతారామునిపేట, రామతీర్థంలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వరి పంటలను ఆమె పరిశీలించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు గురుంచి వివరించి వరిలో పురుగు, తెగుళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. అధికంగా ఎరువులు వాడకుండా సేంద్రియ వ్యవసాయం వైపు రైతులు మొగ్గు చూపాలని సూచించారు. పశువర్ధక శాఖ వైద్యులు చంద్ర శేఖర్ ప్రభుత్వ పథకాలు, రాయితీలు, వాక్సినేషన్, పశుగనన, కిసాన్ కార్డు గురుంచి వివరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వేపాడ: మండలంలో వీలుపర్తి, ఎన్‌కెఆర్‌పురం గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఒ సిబి యశ్వంత్ రావు మాట్లాడుతూ రైతులు తెగుళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం ఎన్‌కెఆర్‌పురంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి సబల్ ప్రాజెక్టు ద్వారా అందించిన పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విహెచ్ఎ జ్యోతి విఎఎ ప్రసాద్ ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఎమ్‌టి సన్యాసమ్మ, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

రేపు ప్రభుత్వ ఐటిఐలో జాబ్ మేళా

ప్రజాశక్తి- బొబ్బిలి

స్థానిక ప్రభుత్వ ఐటిఐలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ బివి రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. టెన్త్, ఐటిఐ, ఇంటర్మీడియట్, ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన 18 నుంచి 35 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులని చెప్పారు. హెటిరో డ్రగ్స్, పేటిఎం, యంగ్ ఇండియా, మొదలగు బహుళజాతి కంపెనీలలో ఉద్యోగాలు కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు skilluniverse.apssdc.in వెబ్సైట్ లో పేరు నమోదు చేసుకుని రిఫరెన్స్ నెంబర్, ఆధార్, విద్యార్హత సర్టిఫికేట్స్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలు ఒక సెట్, పాస్ పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలని కోరారు. పూర్తి వివరాలకు 9988853335 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

ఆ కాల్స్‌ను నమ్మొద్దు

బొబ్బిలి ఉపాధ్యాయుడి అనుభవం

ప్రజాశక్తి- బొబ్బిలి

సైబర్ పోలీస్ అంటూ నేరుగా మనకు ఫోన్ కాల్స్ చేస్తూ.. మన వివరాలు చెప్పేస్తూ.. మనల్ని ట్రాప్‌లోకి లాగేసి డిజిటల్ అరెస్టు అంటూ.. డబ్బులు గుంజడం ఈ మధ్య సర్వసాధారణం అయిపోయింది.. బొబ్బిలి పట్టణానికి చెందిన మింది విజయ మోహన రావు మాస్టారుకు బుధవారం మధ్యాహ్నం ఈ అనుభవం ఎదురైంది. మధ్యాహ్నం ముంబై పోలీస్ కార్యాలయం నుంచి డిసిపి నంటూ 923361440621 నంబరుతో హిందీ భాషలో మాట్లాడుతూ ఒక వ్యక్తి ఫోన్ చేశాడు. తన పేరు చత్ర మనోహర్, ముంబై సెంట్రల్ పోలీస్‌లో డిసిపి నంటూ విజయ మోహన్ రావు పేరు, ఆధార్ నంబర్, విదేశాల్లో ఉన్న వాళ్ళ అబ్బాయి పేరు, వివరాలు కూడా చెప్పాడు. ఇంకా మీ అబ్బాయి మీకు హవాలా మార్గంలో డబ్బు పంపిస్తున్నట్లుగా రికార్డ్స్ వస్తున్నాయి. ఇందుకోసం మీకు సమన్లు జారీ చేశామని చెప్పాడు. ఇందులో భాగంగా మీ బ్యాంక్ ఖాతాలను స్తంభింపచేస్తున్నట్లు తెలిపాడు. ఈ డిజిటల్ అరెస్టులు తప్పించుకోవాలనుకుంటే మీరు కొంత సొమ్ము కట్టవలసి ఉంటుందని అన్నాడు. వెంటనే మాస్టారు మీ వివరాలను ముందు స్థానిక పోలీసులకు అందించండి అనేసరికి అవతలి వ్యక్తి ఫోన్ కట్ చేశాడు. విజయ మోహన్ రావు మాస్టారు ఈ సమాచారాన్ని బొబ్బిలి పోలీసులకు అందించారు. ప్రజలందరూ ఇలాంటి ఫేక్ కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని బొబ్బిలి పోలీసులు కోరుతున్నారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలి : జెసి

ప్రజాశక్తి- రాజాం, చీపురుపల్లి, మెరకముడిదాం

గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని జెసి ఎస్ సేతుమాధవన్ అన్నారు. బుధవారం జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని జెసి ఎస్ సేతు మాధవన్ పరిశీలించారు. గరివిడి, మెరకముడిదం, రాజాం, తెర్లాం మండలాల్లోని పలు గ్రామాలను సందర్శించి ఆయా గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణకు చేపడుతున్న చర్యలను రక్షిత తాగునీటి పథకాల క్లోరినేషన్ శుభ్రపరిచేందుకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లో రక్షిత నీటి పథకాల క్లోరినేషన్ క్రమం తప్పకుండా చేస్తున్నది లేనిది రికార్డులు పరిశీలించారు. గరివిడి మండలం జగన్నాథపురంలో చేపట్టిన పారిశుధ్య చర్యలను జెసి పరిశీలించారు. మెరకముడదాం మండలం చిన్న బట్టుపల్లిలో రక్షిత మంచి నీటి సరఫరా పథకం పరిశీలించారు. రాజా మండలం బొద్దాం, తెర్లా మండలంలో కుసుమూరు గ్రామాల్లో కూడా జెసి పర్యటించి పారిశుధ్య కార్యక్రమం తీరుపై గ్రామస్థాయి సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో చీపురుపల్లి ఆర్‌డిఒ సత్యవాణి, ఆయా మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు.

వేపాడ: గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటిపై దృష్టి పెట్టాలని మండల ప్రత్యేకాధికారి లక్ష్మి నరసింహ అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో బుధవారం పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. రానున్న తుపాను నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో చేపట్టాల్సిన చర్యలపై పలు సూచనలు చేశారు. గ్రామాల్లో క్లోరినేషన్, పారిశుధ్యం, స్వచ్ఛమైన నీరు అందించడం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సమావేశంలో ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, పిఆర్ జెఇ ఆలీ, సిహెచ్ఒ ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా పారిశుధ్య పనులు

మండలంలోని వల్లంపూడి, సింగరాయి, ఆతవ జగ్గయ్యపేట గ్రామాల్లో జరిగిన ఈ పనులను మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ పరిశీలించారు.

వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న జెసి సేతుమాదవన్

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో నిర్వహించిన పారిశుధ్య పనులను గ్రామ సచివాలయ ప్రత్యేక అధికారి, మండల విద్యాశాఖ అధికారి ఎం వరప్రసాద రావు, సర్పంచ్ బుడుమూరు పట్టాభి, పంచాయతీ కార్యదర్శి కూర్మారావు బుధవారం పరిశీలించారు. గత మూడు రోజులుగా మెయిన్ వీధి, గొల్ల వీధి, తెలగ వీధి తదితర వీధులలో పారిశుధ్యం పనులు పరిశీలించి తీసిన చెత్తను దూర ప్రాంతాలకు ట్రాక్టర్లతో తరలించే విధంగా చర్యలు తీసుకున్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలను కోరారు.

తాగునీటి పథకాలను పరిశుభ్రం చేయాలి

గ్రామాల్లో తాగునీటి పథకాలు పరిశుభ్రం చేసి, పారిశుధ్యం మెరుగు పరచాలని మండల ప్రత్యేకాధికారి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి సూచించారు. బుధవారం ఖండ్యాం గ్రామంలో మంచినీటి పథకాలను, పారిశుధ్యాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు నిత్యం పారిశుధ్యం పరిశీలించి, తాగునీటి పథకాల క్లోరినేషన్ చేయాలని సూచించారు. జ్వరాలు, అతిసారం ప్రబలకుండా చూడాలన్నారు. ఈయనతోపాటు సర్పంచ్ ముత్యాలమ్మ, పంచాయతీ కార్యదర్శి పోలినాయుడు ఉన్నారు.

బొబ్బిలిరూరల్ : ప్రతి గ్రామంలో ఉన్న తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించాలని మండల ప్రత్యేకాధికారి కె.మధుసూదనరావు అధికారులను ఆదేశించారు. బుధవారం జగన్నాథపురం, కోమటిపల్లి, పారాధి, రంగరాయపురం తదితర గ్రామాల్లో తాగు నీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నీటి కాలుష్యం ద్వారా అనేక వ్యాధులు సంక్రమించే అవకాశముందన్నారు. కాచి వడపోసిన నీళ్ల మాత్రమే తీసుకోవాలని గ్రామస్తులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ రవి కుమార్, ఇఒపిఆర్‌డి భాస్కరరావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రవణ్ కుమార్, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రామభద్రపురం: గ్రామీణ ప్రాంతాల్లో అపారిశుధ్యం నిర్మూలించడానికి అన్ని చర్యలూ తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ప్రశాంత కుమార్ కోరారు. మండలంలోని బూసాయవలస, ఆరికతోట గ్రామాలలో ఎంపిడిఒ రత్నంతో కలిసి బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మురికి నీరు నిల్వ ఉండకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి జ్వర లక్షణాలున్నా వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాలు, డెంగీ లక్షణాలపై సర్వే చేయాలని తెలిపారు. తహశీల్దార్ సులోచనారాణి రామభద్రపురం కూరగాయల మార్కెట్‌ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి పార్థసారధి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సంతకవిటి: మండలంలోని కావలి గ్రామాన్ని బుధవారం ఎంపిడిఒ సురేష్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఫీవర్ రోగుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు విష జ్వరాలు బారిన పడకుండా తగుజాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ప్రజలకు నిత్యం వైద్య సిబ్బంది అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం గ్రామాన్ని క్లోరినేషన్‌తో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ తమ్మినైనా రవీంద్ర నాయుడు, పంచాయతీ సెక్రటరీ సిహెచ్ సురేంద్ర కుమార్, వైద్య సిబ్బంది, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను తనిఖీ చేసిన జెసి

తెర్లాం, సంతకవిటి: తెర్లాం మండలంలోని కుసుమూరు, సంతకవిటి మండలంలోని తమరంలో ఉన్న ఇసుక రీచ్‌ను బుధవారం జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్, బొబ్బిలి ఆర్‌డిఒ రామ్మోహన్‌రావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక ఎవరైనా రవాణా చేసినా కఠినంగా వ్యవహరించాలని ఈ సందర్భంగా రెవెన్యూ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. ఇక్కడ ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని ప్రభుత్వ నిబంధనలు ప్రకారం ఇసుక సరఫరా చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ టీవీ రామారావు, తహశీల్దార్ హేమంత్ కుమార్, ఎంపిడిఒ ఆర్ రాంబాబు, ఎఒ సునీల్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు

డెంకాడ: మండలంలోని అక్కివరం బుధవారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. మండల పశుసంవర్ధక శాఖ అధికారి ఎం.శ్రీకాంత్ మాట్లాడుతూ అక్కివరంలో 957 గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. ఈ అవకాశాన్ని మేకలు, గొర్రెల పెంపకం దారులు వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి కంది చంద్రశేఖర రావు, సర్పంచ్ కంది కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పోటీలకు విద్యార్థిని ఎంపిక

డెంకాడ: మండలంలోని గునుపూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కెల్ల రేష్మ రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఇటీవల పెద్దమేడపల్లిలో జరిగిన జిల్లా స్థాయి 400 మీటర్స్ రన్నింగ్‌లో ప్రథమ స్థానం, 800 మీటర్స్‌లో ద్వితీయ స్థానం పొంది నవంబరు 2,3,4 తేదీల్లో శ్రీకాకుళంలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైందని పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయుడు ఎస్. గౌరీ శంకర్ తెలిపారు. బాలికను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలి

రేగిడి: విద్యార్థులకు చట్టాలపై అవగాహన ఉండాలని ఎస్ఐ పి.నీలావతి అన్నారు. బుధవారం దేవుదల కస్తూరిబా గాంధీ బాలికల విద్యార్థులకు చట్టాలు, మాదకద్రవ్యాలు,సైబర్ క్రైమ్ ఇతర వాటిపై అవగాహన కల్పించారు. కౌమార దశలో ఉన్న బాలికలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఎటువంటి ట్రాప్‌లో పడకుండా ఉండాలన్నారు. ఒత్తిడికి గురి కాకుండా చదువుపై దృష్టి సారించాలన్నారు. లక్ష్యాలు సాధించినట్లయితే మంచి భవిష్యత్తు ఉంటుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చెప్పిన విధంగా నడుచుకోవాలని సూచించారు.

విద్యార్థినులకు యూనిఫాం పంపిణీ

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల విద్యార్థినులకు బుధవారం ఉచితంగా యూనిఫాంను పంపిణీ చేశారు. ఈ కళాశాలలో తెలుగు అధ్యాపకులుగా పనిచేస్తున్న ఎయుఎం రహీం షేక్‌లాల్ రూ.12వేలు విలువ గల ఉచితంగా కుట్టించిన యూనిఫాంను పంపిణీ చేసినట్లు హెచ్ఎం ఉమామహేశ్వరరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధర్మవరం హైస్కూల్ ప్లస్‌లో చదువుకుంటున్న విద్యార్థినిలకు గత మూడు సంవత్సరాలుగా ఉచితంగా కుట్టించిన యూనిఫాం తెలుగు ఉపాధ్యాయులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు పొట్నూరు శివాజీ, ఎం యూఎం రహీమ్ షేక్ లాల్, తమ్మినాన రాజేష్, జయలక్ష్మి, ఎస్వీఎస్ మూర్తి, అరసాడ సురేంద్రనాథ్, సిహెచ్ కృష్ణంరాజు విద్యార్థినిలు పాల్గొన్నారు.

అర్హుల గుర్తింపునకు సర్వే

ప్రజాశక్తి: మండలంలోని సింగరాయి గ్రామంలో రుణాలకు అర్హులైన వారిని అధికారులు బుధవారం సర్వే చేసి గుర్తించారు. గ్రామంలో ఎస్‌సికి కాలనీకి చెందిన సుమారు 60 మందికి పాడి గేదెలు రుణాలు మంజూరు చేయమని జిల్లా కలెక్టర్‌కి ఇటీవల వినతి పత్రాన్ని ఇచ్చిన నేపథ్యంలో జిల్లా షెడ్యూలు కులాల సంక్షేమ సేవా సంఘం ఎగ్జిక్యూటివ్ అధికారి చెలిపోని రాధాకుమారి హాజరై సర్వే చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అర్హులను గుర్తించి గేదెల రుణాలు కోసం ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ఈ పరిశీలనలో షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం సిసిఎస్ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎస్.కోట-పెందుర్తికి నాలుగు లైన్ల రహదారి

శృంగవరపుకోట: ప్రతిష్టాత్మకమైన భారతమాల పరియోజన చొరవ కింద పెందుర్తి నుంచి ఎస్.కోట మండలంలోని బొడ్డవర వరకు నాలుగు రోడ్ల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం రూ. 956.21 కోట్లు నిధులు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందని ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి అన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ పెందుర్తి-బొడ్డవర రహదారి ఎస్.కోట, విశాఖపట్నం మధ్య ప్రయాణాన్ని గణనీయంగా సులభతరం చేస్తుందని చెప్పారు. విశాఖపట్నం నుంచి వచ్చే వారికి ప్రయాణ సమయం కూడా తగ్గుతుందన్నారు. అరకులో పర్యాటక రంగానికి ప్రోత్సాహకంగా ఈ రహదారి ఉపయోగపడుతుందని చెప్పారు.

ఎంపిక చేసిన పనుల పరిశీలన

తెర్లాం: మండలంలోని రంగపువలస, కూనయవలస, ఆమిటి, లోచర్ల గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన పల్లె పండగ కార్యక్రమంలో గుర్తించి అభివృద్ధి పనులను ఎస్ఇ ఎం. శ్రీనివాస్ పరిశీలించారు. త్వరితగతిన పనులు ప్రారంభించాలని ఆదేశించారు. పనుల్లో నాణ్యత లోపించకుండా చేపట్టాలన్నారు. ఆయన వెంట డిఇ సిహెచ్‌వి అప్పారావు, జెఇ వి.సత్యం నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై అవగాహన

శృంగవరపుకోట: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం ఎన్నికల ఉప తహశీల్దార్ సునీత ఓటర్ నమోదుపై అవగాహన కల్పించారు. 18 ఏళ్లు నిండిన వారు ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

గజపతినగరం: రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో పోటీలకు మండలంలోని మరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు క్రీడాకారులు ఎంపికైనట్లు ఆ పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చింత సత్యనారాయణ బుధవారం తెలిపారు. మంగళవారం విజయనగరం రాజీవ్ క్రీడ మైదానంలో జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్స్ ఖోఖో పోటీల ఎంపిక ప్రక్రియలో తమ విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన చూపి ఎంపికైనట్లు చెప్పారు. తొమ్మిదో తరగతి చదువుతున్న సురేంద్ర, రవి, దుర్గ ఎంపికయ్యారన్నారు. ఈనెల 25, 26, 27 తేదీల్లో చిత్తూరు జిల్లా కాణిపాకంలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. ఎంపికైన ఈ క్రీడాకారులను పాఠశాల ప్రధానోపాధ్యాయిని వి.నాగమణి, గ్రామ సర్పంచ్ లెంక రామలక్ష్మి, మాజీ ఎంపిపి గంట్యాడ శ్రీదేవి, పాఠశాల సిబ్బంది అభినందించారు.

రీ సర్వే గ్రామసభకు దరఖాస్తుల వెల్లువ

వేపాడ: మండలంలోని బల్లంకి గ్రామంలో బుధవారం నిర్వహించిన భూముల రీ సర్వే గ్రామ సభకు 34 దరఖాస్తులు వచ్చాయని వివిధ కేటగిరీలకు సంబంధించిన ఈ దరఖాస్తులపై తగు చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ జె.రాములమ్మ తెలిపారు. ఈ గ్రామ సభలో ప్రాదేశిక సభ్యులు గొంప తులసి, విఆర్ఒ సన్యాసిరావు, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

యువకుడు ఆత్మహత్య

వంగర: మండలంలోని అరసాడ గ్రామానికి చెందిన గాడి రమేష్(31) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు హెచ్‌సి రామకృష్ణ తెలిపారు. కడుపు నొప్పి తాళలేక పురుగుల మందు తాగిన రమేష్‌ను కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలో గల రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. హైదరాబాదులో రక్షా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడని తండ్రి అప్పలసూరి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెచ్‌సి వెల్లడించారు.

మృతుడి ఆచూకీ లభ్యం

భోగాపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందిన వ్యక్తి ఆచూకీ లభ్యమైందని ఎస్ఐ సూర్యకుమారి తెలిపారు. పూసపాటిరేగ మండలం బోరపేట గ్రామానికి చెందిన పులప గౌరీశంకర్ (30)గా గుర్తించినట్లు ఆమె తెలిపారు. ఈయన ఉపాధి నిమిత్తం విశాఖపట్నంలో నివసిస్తున్నాడు. ఈనెల 21వ తేదీన సుందరపేట వంతెనపైన విశాఖ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా బోల్తా పడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

గజపతినగరం: మండలంలోని మదుపాడ గ్రామంలో ఈనెల 15వ తేదీన అపస్మారక స్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని గుర్తించి వైద్యం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. ఆ వ్యక్తి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్.ఐ కె.లక్ష్మణరావు తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ తెలిసిన వారు స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.